# తుమ్ముల్రావ్ కథ !

మా 'బాస్' గోవర్ధ ఎలర్జీ పేషెంట్ ! ప్రపంచ తుమ్ముల పోటీలో గోల్డ్ మెడలిస్ట్ ! తుమ్మటం ప్రారంభిస్తే వంద... నూటయాభై తుమ్మాల్సిందే ! అలా తుమ్మిన ప్రతిసారీ మనిషి తెగ హైరానా పడతాడు.

బాస్ కూర్చునే ఛేంబర్ తుమ్ములకు దద్దరిల్లుతుంది. రూఫ్ టాప్ లేచిపోతుందేమోనిపిస్తుంది. తుమ్ముతూంటే ఆకాశం వురుముతున్నట్టు... పిడుగులు పడుతున్నట్టు... భూమి కంపిస్తున్నట్టనిపించకమానదు. గ్రహాల గతులు తప్పుతాయేమోనిపించాల్సిందే !. అంత భయంగొలిసేట్టు తుమ్ముతాడు మహానుభావుడు !

పిల్లలు దడుచుకుంటారు ! హార్ట్ పేషెంట్లు గుండె ఆగి చస్తారంతే !. ఆయన నాన్‌స్టాప్‌గ తుమ్మటంలో దిట్ట ! ఆయన అసలుపేరు మర్చిపోయి... అందరూ తుమ్ముల్రావ్ అనే పిలుస్తూంటారు. ఎలా పిలిచినా ఏమీ అనుకోడు ! 'స్పోర్టివ్' గ తీసుకునే స్వభావం ఆయనది !

తను బాస్ అనే గర్వంగాని... అహంభావం గాని లేని మంచి మనిసి ! ఆయన తుమ్ముల వెనుక ఓ పేద్ద కథవుందిని 'టము' కేసి కుంటాడు. భలే తమాషా మనిషి ! నలభైయ్యేళ్లు పైబడుతున్నా ఇంకా బ్రహ్మచారే ! అదీ ఆయనే చెప్పుకుంటాడు.

ఆయన ఆఫీసులో రిపోర్ట్ చేసిన కొత్తల్లో ఆయన తుమ్మటం చూచి అదిరిపడ్డారందరూ! విషయం తెల్సుకున్న తర్వాత పరిస్థితికి జాలిపడ్డారు ! చివరికి అలవాటుపడ్డారు. భార్యాపిల్లలు లేరు కనుక బాస్ పొజిషన్ సేఫ్ ! లేకుంటే... భూతవైద్యుడి వద్దకు దడుపు విభూది కోసం నిత్యమూ పరిగెత్తాల్సివచ్చేది.

తుమ్ములకు కారణం 'ఎలర్జీ' అని వైద్యులు నిర్ధారించారు. అలోపతి... హెూమియోపతి... ఆయుర్వేదవైద్యం... ప్రకృతి వైద్యం... నేచురోపతి వైద్యం ఇత్యాదులెన్నో చేయించినా ఫలితం ట్రీట్‌మెంట్ జోలికెళ్లటం మానేశాడు.

ఇండియాలో వున్న డాక్టర్లనే కాకుండా... బలిసినవాడు (డబ్బున్న) కావటంతో ప్రపంచమంతా తిరిగి ఎన్నో దేశాల వైద్యులను కలిసి ట్రీట్‌మెంట్ తీసుకున్నా నిష్ప్రయోజనమే అయింది ! ఖర్చయితే తడిసి మోపెడైంది గాని రోగం మాత్రం

నయం కాలేదు.

తుమ్ములతో ఏ క్షణంలో గుండె ఆగి 'హరీ' అంటాడోని గోవర్ధనం డాడీ కాశీపతి ఓసారి సిద్ధాంతిని కలిసి జాతకం క్షుణ్ణంగ పరిశీలన చేయించాడు.

గ్రహవీక్షణం బాగానేవుంది ! ఇతగాడికి పూర్ణాయిష్షుంది ! ఆయుర్దాయం గురించి కలవరపడాల్సింది గాని కలత చెందాల్సిందిగాని ఏమీ లేదు. మీరేం కంగారుపడకండి ! సిద్ధాంతి ధైర్యాన్ని నూరిపోయటంతో కాశీపతి మనసు కుదుటపడింది.

కాశీపతికి ఒక్కగానొక్క మగనలుసు గోవర్ధన్ !... అదీ ఎన్నో నోములు నోచి... వ్రతాలు చేసి... తీర్థయాత్రలు సేవించగా పుట్టిన బిడ్డ కావటాన అపురూపంగా పెంచుతూ వచ్చారు.

మొత్తానికి వంశోద్ధారకుడు పుట్టినందుకు కాశీపతి దంపతులు పదవశం చెందారు. కోట్లరూపాయల విలువచేసే తమ సంపదకు వారసుడు కలిగినందుకు కాశీలో అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. అఖిలాండేశ్వరి అమ్మవారికి బంగారువడ్డాణం.... తిరుపతి వెంకటేశ్వరునికి వజ్ర కిరీటం చేయించిన ఘనట కాశీపతి దంపతులకే దక్కింది!

మొత్తానికి మగబిడ్డ పుట్టి తమను పున్నామ నరకం నుండి తప్పించినందుకు మురిసిపోయారు.

తుమ్ముల బాధవక్కటే గోవర్ధనం మైనస్ పాయింట్! మిగితా విషయాల్లో జమ్! మంచి భోజన ప్రియుడు. తిండి పుష్టి కలవాడు! ముప్పొద్దులా మూడు కంచాలు లాగిస్తాడు. కాఫీ టిఫిన్లజోలికి అస్సలు పోడు. హొటళ్ళకే అలవాటే లేదు అతగాడికి!

చదువుకునే రోజుల్లో ఫ్రెడ్సెవరూ పక్కన కూర్చోనిచ్చేవారు కారు. అతగాడి తుమ్ముల దెబ్బకు భయపడి టీచర్లు.... లెక్చరర్లు సైతం గోవర్దనం తుమ్ములకు హడలి చచ్చేవారు. ఎక్కడో వున్న హెడ్మాస్లరు.... ప్రిన్సిపాల్స్ క్లాసులో కూర్చుని పాఠాలువింటున్న గోవర్ధనం తుమ్ములకు భయపడి పరుగెత్తుకొచ్చేవారు.

ఒరే గోవర్ధనం నువ్వు తుమ్మేసమయంలో ముక్కులో కర్చీఫో.. నేప్కిన్నో అడ్డం పెట్టుకోరాబాబూ కాస్తంత శబ్దం కంట్రోల్ అవుతుంది... అంటూ ఎగతాళి చేసి మాట్లాడినా కోపం తెచ్చుకోకుండా... పళ్ళికిలించేసేవాడు.

గోవర్ధన్ చిన్నతనంలో కోయదొరలు ఇంటిముందు కొచ్చిన్నప్పుడు కొడుకు

తుమ్ముల బాధ గురించి చెప్ప ఓవంద రూపాయలు ఇచ్చి ముక్కులో ఆకుపసరు పిండించినా వ్యాది నయం కానందుకు తల్లి యశోదమ్మ ఎంతో మనస్తాపానికి గుర్రైంది.

ఇటు పి.జి. పూర్తికావటం అటు ఉద్యోగం రావటం వక్కసారే జరిగినందుకు హెపీ ఫీలైనాడు గోవర్ధనం!

కన్నవారు ఇక కొడుకు పెళ్ళి,ఏయటం కోసం సంబంధాలు వెతికే వేటలో పడ్డారు.

కొడుకు వీక్‌నెస్ ఎరిగిన కాశీపతికి.... వీడి తుమ్ముల గోలతో మంచి సంబంధం దొరుకునో లేదోనే వర్రీ పట్టుకుంది.

ఏ పెళ్ళి చూపులకెళ్ళినా... ఆడపిల్ల వారింట్లో అడుగుపెట్టగానే చోవర్ధనం తుమ్ముల గోల మొదలైయ్యే ఆడపిల్ల పేరెంట్స్... ఇంట్లోవాళ్ళు తుమ్ముల దెబ్బచూచి భయంతో వారిగుండెల్ళో రైళ్ళు పరిగెత్తేవి.

ఏ పెళ్ళి చూపులకెళ్ళినా... ఆడపిల్ల వారింట్లో అడుగుపెట్టగానే చోవర్ధనం తుమ్ముల గోల మొదలైయ్యే ఆడపిల్ల పేరెంట్స్... ఇంట్లోవాళ్ళు తుమ్ముల దెబ్బచూచి భయంతో వారిగుండెల్ళో రైళ్ళు పరిగెత్తేవి.

గోవంర్ధనం తుమ్ముల కారణాన కాళ్ళ దగ్గరకొచ్చిన ఎన్నో మంచి సంబంధాలు బెడిసికొట్టినయ్!

కొడుక్కి పెళ్ళి అయ్యేవరాత లేదేమోని కాశీపతి దంపతులకు దిగులు పట్టుకుంది.

'ఒరేయ్ గోవర్ధనం... పెళ్ళిచూపులకెళ్ళిన ప్రతీ సారీ నువ్వు నాన్‌స్టాప్ నాన్‌సెన్స్' లా తుమ్ముతుంటే ఏ ఆడపిల్ల తండ్రి నీ కాళ్ళుకడిగి కన్యాదానం చేయడానికి ముందుకొస్తాడ్రా!' తల పట్టుకున్నాడు కాశీపతి.

నన్నేమిచేయమంటావ్ డాడీ?... తుమ్మటం నాకేమైనా సరదానా? ఆపుకోవాలని ఎంత

సిన్సియర్‌గా ప్రత్నించినా నా వల్ల కావటంలేదు. నాతుమ్ములకు.. పెళ్ళికిలంకెపెట్టకండి డాడీ...

తలరాత ఎలావుంటే అలా జరుగుతుంది.... ' గొవర్ధనం సమాధానంలో చిరుకోపం చోటుచేసుకుంది.

నేను అంటున్నానని కాదురా! .... ఇలా ఒక్కో సంబంధం బెడిసి కొడుతుంటే....

కొన్నాళ్ళకి పిల్ల నివ్వటానికి ఎవరూ ముందుకురారు. నీ కా వయసు మించిపోతుంది. నీ ఓ ఇంటి వాడివై సంతానాన్ని కంటే.. వంశం వృద్ధిలో కొస్తుంది. లేకపోతే మనతోటే అంతమైపోతుంది! అదేరా నా బాధంతా..... మొత్తుకున్నాడు కాశీపతి.

X X X

ఇంట్లో వున్న వారందరూ ఓ ఏడాది పాటు కుమ్ములాడుకోగా.... చివరికి ఓ సంబంధం ఖాయమైంది. పెళ్ళి చూపుల కొచ్చిన గోవర్ధనం ఏకధాటిగ తుమ్ముతున్నప్పటికీ.... దాన్ని అపశకునంగ భావించక.... ఇరు పక్షాలవారూ ఇచ్చిపుచ్చుకోవటానికి అంగీకారం జరిగింది.

జీలకర్ర బెల్లం ఒకరినెత్తిన మరొకరు పెట్టే సమయంలోనూ తుమ్మే గోవర్ధనాన్ని చూచి పెళ్ళి కొచ్చిన వారంతా ఈ పెళ్ళి ఎకక్కడ ఆగిపోతుందోని హడలిచచ్చారు!

మొత్తానికి గోవర్ధనం వివాహం వైభవోపేతంగా జరిగింది.

పెళ్ళిచూపుల సమయంలో గోవర్ధనం తుమ్మటం చూచి.... జలుబు చేసిందేమో. అనుకుంది వందన. శోభనం మూడురోజులూ తుమ్ములతోటే సరిపోయింది. తెల్లవార్లూ వందనకు చిర్రెత్తుకొచ్చింది నిద్రా భంగమైనందుకు మనసులో నిందించుకుంది.

మిరియాలు ధనియాలు రోట్లో దంచి కషాయం చేసితాగితే ఈ తుమ్ములు తట్టుకుంటాయ్ అని తనకు తెలిసిన చిట్కావైద్యం ఇటు భర్తకు.... అటు అత్తగారికీ చెప్పి వారం రోజుల పాటు రోజుకు రెండుపూటలూ తాగించింది వందన.

తాను చేసినదంతా వృధాశ్రమే కావటంతో ఏంచేయటానికీ పాలుపోలేదు.

ఈ తుమ్ముల మొగుడితో జీవితాంతం కాపురం చేయాలంటే ఎలా? వామ్మో! అతగాడి ఎలర్జీ ఒకనాటికి తనకు అంటకమానదు.

తుమ్ములకు వేళపాళ... సమయం సందర్భం లేకుండా భర్త బాధపడుతుంటే అయ్యోపాపం అన్పించే వందనకు! ఒక్కోసారి చిరాకన్పిస్తోంది. మరోసారి అసహ్యంగా తోస్తోంది. ఇలా తుమ్ముతూంటే సంసారం ఎలాచేయాలో బోధపడక తప్పటంలేదు.

ఆర్నెల్లపాటు అత్తవారింట్లో వందన వున్నదన్న మాటేగాని.... భర్తతో సుఖపడ లేక పోతోంది. ఈ నరకం నుండి బయటపడటం ఎలారా దేవుడాని దిగులుపడసాగింది.

పుట్టిల్లు లేకలే కాబట్టి కట్టుబట్టలతో అత్తారింటి నుండి ఎవ్వరికీ చెప్పకుండా

బయల్దేరింది వందన.

అత్త వారింట్లో తాను అనుభవించే వేదన గురించి క్షుణ్ణంగ వివరించింది. గోవర్దనంతో ససేమిరా కాపురం చేయనంటూ మొండికేసింది.

వందన ఫాదర్ పేరున్న హైకోర్ట్ లాయర్ కావటంతో కూతురి పరిస్థితి లీగల్‌గా కూడా దీర్ఘంగ ఆలోచించాడు! లా బుక్స్ తిరగేశాడు. బుర్ర గోక్కున్నాడు. తలగోడకే కొట్టుకున్నాడు.

అయినా ఎలాంటి సొల్యూషన్ దొరకలేదు.

చూడు వందనా! భర్త తుమ్మెడనో... దగ్గేడనో కట్టుకున్న వాడిమీద కోర్టులో కేసు వేయలేం!

ఈ కారణం మూలంగ డైవోర్సు తీసుకోవటం దుర్లభం! మన సిల్లీ పాయింట్స్ కోర్టు అంగీకరించదు. అంచేత.... నువ్వే ఏదో విధంగ ఎడ్జెస్టై కాపురం చేసుకోవాలి! తప్పదు.... తలనిమురుతూ బుజ్జగించాడు త్రిలోకరావ్.

ఉహుం! అనేసింది వందన తల్లి గడ్డిపెట్టినా..... తవుడు పెట్టినా... కుడితి తాగించినా వందనను వప్పించటం ఆమెవల్ల కాలేదు.

ఒక్కగానొక్క ఆడపిల్లవుకదాని గారాబంగాపెంచినందుకు కన్నవారికిచ్చే ప్రతిఫలం ఇదా!

అత్త వారింట్లో వుండవలసినదానివి పుట్టింట్లో వుంటే మాకెంత అప్రతిష్ఠ? తల్లి అయినాకాస్తంత కటువుగానే మాట్లాడింది.

ఇదిగో చూడండి ఇంకో సారి నన్ను కాపురానికి వెళ్ళమని వత్తిడి చేసినా.... బెదిరించినా....నేను జాబ్ చూచుకుని తర్వాత వర్కికింగ్ వుమన్ హాస్టల్లో వుంటాను.... మనసులో ఆలోచనవెళ్ళకక్కింది వందన. ఆమాట విన్న పేరెంట్స్ సైలెంటైనారు.

X X X

గోవర్ధన్ పెళ్ళాం ముఖంచూచి అయితే కావస్తోంది. భార్యను బ్రతిమిలాడి తెచ్చుకోవటానికి మనస్కరించక మౌనం వహించాడు.

కోడలిని కాపురానికి తెచ్చుకోకుంటే ఊరేసుకు చస్తామంటు కాశీపతి దంపతులు బెదిరించినా గోవర్ధనంలో చలనం రాలేదు.

సరిగ్గా అదేసమయానికి ప్రమోషన్ మీద చోవర్ధనాన్ని హైదరాబాదు ట్రాన్స్‌ఫర్

చేయటంతో ఇటు కన్నవారి బెడద.... అటు భార్య నిరసల బాధ నుండి బయట పడ్డానన్పించింది.

ఆఫీసుకు దగ్గర్లోవుండేకాలనీ లో ఒక ఇంట్లో పోర్షన్ రెంట్‌కి తీసుకున్నాడు. ప్రస్తుతానికి సింగిల్‌గా అద్దెకు వుండటానికి అంగీకరించినా.... నెల తిరిగేసరికి పెళ్ళాన్ని తెచ్చుకోకతప్పదని కండీషన్ పెట్టాడు హౌస్ ఓనర్.

అద్దె ఇంట్లోకి అడుగు పెడుతూండగానే వీర తుమ్ముడు గోవర్ధనం ఇతగాడి తుమ్ములకు అదిరిపడిన ఇంటివాళ్ళొచ్చి తొంగి చూచి వీపు చరుచుకుని తిరిగి వారి వాటాలోకెళ్ళారు.

గోవర్ధన్ తుమ్ములతో ఇంటివాళ్ళకి తెల్లవార్లూ నిద్రలేకుండా పోయింది.

'బాబూ గోవర్ధనం! నీ తుమ్మలబాధ భరించ లేకుండా వున్నాం. పసిపిల్లలు హడలి చస్తున్నారు. ఏ పని చేయాలన్నా నీ తుమ్ముల అపశకునం చూచి బెదిరిపోతున్నాం. నా పెళ్ళాం కూరలు తరుగుతూ నీ తుమ్ము దెబ్బకు హడలి పోయి వేలు కోసుకుంది. మా అబ్బాయి పరీక్ష సరిగ్గా రాయలేదని చెప్పాడు. ఇట్లా అయితే కుదరదుగానీ ఇల్లు ఖాళీ చేయ్....' అల్టిమేటం ఇచ్చాడు ఓనర్.

ఇలా ఇలా తుమ్ముల కారణాన సిటీలో అనేకానేక ఇళ్ళు మారుతూ వుండటంతో విసుగు చెంది. ఇండిపెండెంట్ ఇల్లొకటి కొనేశాడు.

గృహప్రవేశం రోజున గుమ్మానికి గుమ్మడి కాయ వేలాడ తీసే సమయంలో.... నవగ్రహపూజ చేసేటప్పుడు గోవర్ధన్ ధారావాహికంగా తుమ్ముటం చూచిన పురోహితుడు సహధర్మచారిణితో పీటల మీద కూర్చోకుండా గృహప్రవేశం మగాడొక్కడే తుమ్ముతూ చేస్తే.... అంతా అశుభమేకాక శుభం ఏం జరిగేదుస్తుంది! ఉచ్చరిస్తూనే గొణిగాడు.

ఈ జన్మకి తాను సుఖపడేరాతలేదు. అనుకోక తప్పలుదు తుమ్ముల్రావు ఉ రఫ్‌ఖాన్ గోవర్ధనం!!

సుఖపడినా... పడకపోయినా తన బతుకంతా తుమ్ముల బ్రతుకైనందుకు ఘొల్లుమన్నాడు గోవర్ధన్ !!

( ఆంధ్రప్రభ, ఆదివారం అనుబంధం 14.4.2013)